విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

ఆడుదాం ఆంధ్రతో అంతర్జాతీయ స్థాయికి

రాష్ట్ర ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్

విశాలాంధ్ర -భీమవరం: ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే క్రీడల్లో రాష్ట్ర ప్రాతినిధ్యాన్ని పెంపొందించే దిశగా ఆడుదాం ఆంధ్ర పోటీలను ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం స్థానిక ఎస్.ఆర్.కే.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్ర జిల్లా జిల్లా స్థాయి పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామచంద్ర రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపం చంలో చిన్న, చిన్న దేశాలైన చైనా, జపాన్ వంటివి బంగారు పతకాలు సాధిస్తున్నా యని, క్రీడల్లో ఆంధ్రా ప్రాతినిధ్యాన్ని పెంచే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచన చేసి ఆడుదాం ఆంధ్ర ద్వారా ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో డిసెంబర్ 26, 2023 నుండి జనవరి 2 వరకు గ్రామ, వార్డు, మండల, నియోజకవర్గ స్థాయిలలో నిర్వహించిన పోటీల్లో 5,350 టీములు పోటీ పడటం జరిగిందని, ఆయా టీమ్‌లలో గెలుపొందిన జట్లను ఎంపిక చేసి జిల్లా పోటీలకు సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో బాగా ఆడి రాష్ట్రంలో జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. జిల్లాస్థాయి పోటీలు ఫిబ్ర వరి రెండో తేదీతో ముగుస్తాయన్నారు. ఏడు నియోజకవర్గాల్లో ఒక్కొక్క నియోజకవర్గం నుండి పురుషులు, స్త్రీలు కలిపి 114 మంది చొప్పున 70 టీములు జిల్లాస్థాయిలో పోటీపడనున్నట్లు తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 535 సచివాలయాల పరిధిలో ఐదు క్రీడాంశాలకు సంబంధించి మహిళలు, పురుషులు పోటీపడి జిల్లా స్థాయికి అర్హత సాధించాయన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన 5 టీములు విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పోటీ పడనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి, ఆర్డీఓ కె. శ్రీనివాసులురాజు, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్ అప్పారావు, డియల్డివో ఏవీ అప్పారావు, తహశీల్దారు వై.రవికుమార్, పురపాలక సంఘ కమిషనరు యం.శ్యామల, కళాశాల డైరెక్టరు డాక్టర్ యం.జగపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

పగడ్బందీగా ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

- డిఆర్ఓ యం. వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర -ఏలూరు : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డిఆర్వో యం.వేంకటేశ్వర్లు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ డిఆర్వో ఛాంబర్ నందు ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై ఇంటర్మీడియేట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ జిల్లా కమిటీ సభ్యులు విద్యాశాఖ, పోలీస్, విద్యుత్, వైద్యశాఖ, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో డిఆర్ఓ యం.వేంకటేశ్వర్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు మూడు దశలుగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ పరీక్షలకు జిల్లాలో 124 పరీక్షా కేంద్రాల్లో మొదటి, రెండవ సంవత్సరానికి సంబంధించిన మొత్తం 32,445 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 15,656 మంది, రెండవ సంవత్సరం 16,789 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, 3వ తేదీన ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు జరుగుతాయని, ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు 124 సెంటర్లలో 31,312 (రెండు రోజులు) మంది విద్యార్థులు హాజరుకానున్నారని అన్నారు. ఈ పరీక్షలను ఇంటర్మీడియట్ విద్యార్థులు తప్పనిసరిగా వ్రాయాల్సి ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీ నుండి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు (ఒకేషనల్), 29 సెంటర్లలో 3,919 మంది విద్యార్థులు, ఫిబ్రవరి 11 వ తేదీ నుండి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు (జనరల్) 69 కేంద్రాల్లో 9,898 మంది విద్యార్థులు, నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో డివిఇఓ మరియు కన్వీనర్ డిఇసి బి. ప్రభాకరరావు, అడిషనల్ ఎస్పీ ఎన్ ఎస్ ఆర్ శేఖర్, డిఎస్పీ చంద్రశేఖర్, డిపివో టి. శ్రీనివాస విశ్వనాథ్, డిఇఓ శ్యామ్ సుందర్, కమిటీ మెంబర్స్ కె. యోహాన్, ఎ. నాగేశ్వరరావు, ఎం. పేర్రాజు, నగరపాలక సంస్థ ఇఇ భాస్కర్, ఎంహెచ్ఓ మాలతి, ఎలక్ట్రికల్ డిఇ డి. శ్రీనివాసరావు, ఆర్ టిసి, పోస్టల్, హెల్త్ తదితర, అధికారులు పాల్గొన్నారు

గ్రామాభివృద్ధిలో ప్రజలను భాగస్వాముల్ని చేయాలి

విశాలాంధ్ర - లింగపాలెం : గ్రామాభివృద్ధిలో ప్రజలను భాగస్వాములు కావాల్సి ఉందని, దీనిపై గ్రామ స్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలని డిఎల్‌పిఓ సుందరి అన్నారు. లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈమె పలు సూచనలు చేశారు. మండలంలో దాదాపు 90 లక్షలకు పైగా ఇంటి పన్ను, నీటి పన్నులు వసూలు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. పన్నులు చెల్లించేలా గ్రామాలలో ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలు కల్పించవచ్చన్నారు. వీటిని వసూలు చేయడంలో పంచాయితీ కార్యదర్శులు శ్రద్ధ చూపాల, ప్రజలు సమస్యలను తెలుసుకుని పన్నులు చెల్లించాలని అన్నారు. పన్నులు చెల్లించడం వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని, ఈ బాధ్యత కార్యదర్శులపై ఉందని తెలిపారు. వసూలు అయిన ప్రతీ రూపాయినీ పంచాయతీ ఖాతాలో జమ చేసి వాటి ద్వారా గ్రామాలలో మౌలిక వసతులు సమకూర్చుకోవాలని సూచించారు. ప్రజలను భాగస్వాములు చేయడం వలన పన్నులు వసూలు సులభతరం అవుతుందన్నారు. పన్నులు చెల్లించే ప్రతీ ఒక్కరికి గ్రామ సమస్యలపై నిలదీసే హక్కు ఉంటుందని, దీనిని ప్రజలు గుర్తించాలని అన్నారు. సమావేశంలో మండల విస్తరణాధికారి జె.ఎం.రత్నకుమార్ పాల్గొన్నారు.



PUBLIC NOTICE

Known to all that applicant **Jettiboyina Ramya**, W/o. Jettiboyina Srinivas and Co-Applicant Jettiboyina Srinivas, S/o Jettiboyina Satyanarayana have been sanctioned a Housing Loan by **Repco Home Finance Ltd.**, for Purchase of House in West Godavari District, PalakoderuMandal,Gunupudi Sub-Registry,Gollala koderu Gram Panchayathi area,Gollala Koderu Village taluk,Zeroity Dry land, in R.S.No155,full extent ac.4.66 cents in Which ac.1.40 cents, in R.S.No.160/1,full extent ac.0.74 cents, in Which ac.0.11 cents , totaling of ac.3.68 cents as ONE item, and it was divided into house plots, and made layout,and it was approved from Gollala koderu gram panchayathi as per the approved plan Plot No.33 in Which on eastern side 96.8 square yards and the plan was approved from Gram panchayathi of Gollala koderu Gram panchayathi under B.L.R.No.1133002B47,dated 20.02.2020, and newly constructed RRC building therein bounded,and measured by: :

EAST	: Land belongs to Gadiraju Radhalakshmi in R.S.No. 158/1	-34.0 ft
WEST	: Site belongs to sailakshmi infra in plot No.33{ Thota surya venkata satyanarana}	- 34.0 ft
NORTH	: 33.0 ft width layout road	- 25.6 ft
SOUTH	: Site of plot No.32	- 25.6 ft

Within the above boundaries 96.8 square yards or 80.79 square meters of site, and Ground, and 1st floor RCC building therein, and with all usual,and easumentary rigths, together with doors, doorways, windows, roof, and electrical serivce connection No.00200.. is in favor of Karedla Naga Madhavi proposed to sell the same to **Jettiboyina Ramya** and the same to mortgaged by Jettiboyina Ramya in favour of **Repco Home Finance Ltd.**, Rajahmundry Branch to avail Housing loan for Purchase of House of Rs.24,92,687/- anybody having interest or claims over the property shall intimate to us with in 7 days from the date of this publication inwriting.

S SRI RAMACHANDRA MURTHY, Advocate
Office : D No.78-14-16, SBI Colony,
Symala Nagar, Rajahmundry.

భూ హక్కుల చట్టం తక్షణం రద్దు చేయాలి

అఖిలపక్ష రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక, ప్రజా సంఘాలు, న్యాయవాద సంఘాలు కలెక్టరేట్ ఎదుట ధర్నా

విశాలాంధ్ర-ఏలూరు: రైతులకు, వ్యవసాయ కార్మికులకు, దళితులకు, గిరిజనులకు, ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే భూ యాజమాన్య హక్కుల చట్టం - అసైన్డ్ భూముల చట్ట సవరణను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక, ప్రజాసంఘాలు, న్యాయవాద సంఘాల ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బికెయంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మో హనరావు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఓ.శైలజ, ఏఐటీ యూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి ప్రసాద్, తదితరులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం భూ యాజమాన్య హక్కుల చట్టం -2022 పేరుతో 2023 అక్టోబరు 31న జారీ చేసిన జీవో 512 ద్వారా తీసుకువచ్చిన ఈ చట్టంలో రైతులకు, ప్రజలకు నష్టం కలిగించే అత్యంత ప్రమాదకర నిబంధనలు ఉన్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ భూములు, నివాస స్థలాలు, భవనాలు తదితర అన్ని రకాల స్థిరాస్తులపై హక్కులను నిర్ధారించి టైటిల్ రిజిస్టర్లు నమోదు చేసే అధికారాన్ని రెవిన్యూ అధికారులకు అప్పగించడం వలన రాజకీయ నాయ కులు జోక్యం పెరిగి రైతులు, ప్రజలు ఇబ్బందులు పడతారని చెప్పారు. ఈ చట్టంలో సెక్షన్ 38 ప్రకారం టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, భూమి హక్కు అప్పిలేట్ ఆఫీసర్‌కు నిర్ణయాధికారం కలిగిన ఏ విషయంలోనైనా సివిల్ కోర్టులకు జోక్యం చేసుకునే అధికారం లేదన్నారు. సెక్షన్ 25 ప్రకారం ఒక ఆస్తి యజమాని మరణిస్తే వారసుడు ఎవరు అనేది రెవిన్యూ అధికారులే నిర్ణయిస్తారని, ఇప్పటివరకు రెవెన్యూ అధికారుల చర్యలపై కోర్టులు తీర్పులు చెప్పడం జరుగుతున్నదని, ఈ చట్టం అమలు తర్వాత రెవెన్యూ అధికారుల సర్టిఫికెట్ ఉంటేనే కోర్టులు తీర్పులు చెప్పే అవకాశం ఉంటుందన్నారు. పేద రైతులు అధికారులతో వాదించి గెలవలేరని, రైతుల భూము లను లాక్కొని కార్పొరేట్ కంపెనీ లకు కట్టబెట్టేలా ప్రభుత్వాలు చట్టాలు రూపొందించడం అన్యాయమని విమర్శించారు. ఈ నియంతృత్వ ధోరణి అత్యంత ప్రమాదకరమైనదని, రాజ్యాంగ విరుద్ధమైన దని అన్నారు. ప్రజలు వ్యక్తిగత ఆస్తులపై తమకున్న యాజమాన్యం హక్కులపై న్యాయపరమైన తీర్పు చెప్పి హక్కును రెవెన్యూ అధికారులకు అప్పజెప్పి న్యాయ వ్యవస్థపై రెవిన్యూ అధికారుల పెత్తనాన్ని ప్రోత్సహిస్తున్న ఈ భూయాజమాన్య హక్కు చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర భూ సర్వే లో వస్తున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. భూసేకరణలో పట్టా భూము లతో సమానంగా అసైన్డ్ భూములకు నష్టపరిహారం ఇవ్వలేమని రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ వలన దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు, పేదలు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆర్డినెన్స్ రద్దు చేసి 2013 భూ సేకరణ చట్టాన్ని యధాతధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, బి.కె.ఎం.యు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నాయకులు బి.సోమయ్య, పుప్పాల కన్నబాబు, కడుపు కన్నయ్య, కోన శ్రీనివాసరావు, పంతగాని ఆనందం, సిహెచ్ మణి, డి.నాగేంద్ర, సిహెచ్ జాన్ రాజు, జి. లక్ష్మి, యేసు మణి, లలిత, గోలిమే బాల యేసు, బుగ్గల ప్రభాకర రావు మాంద్రు జాన్, అరిగెల యోహాను, బి. యేసురత్నం, గూడా ఝాన్సీ, ఎ.అప్పలరాజు, పుప్పాల శ్రీనివాసరావు, సాదే బాబు ప్రసాద్, కె.ఎస్.ఎన్. మూర్తి, గౌడు రంగబాబు లంక రామ్మో హన్, ఎస్.వి. సుబ్బారావు,యోహాన్ రాజు,కట్టా సత్యనారాయణ, పి.దావీదు, బి.చింతయ్య, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐకి బాసటగా నిలవండి

ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: మతసామరస్యత, ప్రజాస్వామ్య, లౌకిక తత్వ పరిరక్షణ కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఐకి విరాళాలు ఇచ్చి అండగా నిలవాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య విజ్ఞప్తి చేశారు. బుధవారం కొయ్యలగూడెం పట్టణంలో సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో నిధి వసూలు కార్యక్రమం, విశాలాంధ్ర సర్క్యులేషన్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్రంలో మోడీ రెండవసారి అధికారం చేపట్టిన తర్వాత ప్రజా కంఠక విధానాలను అమలు చేస్తూ ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలు ఇచ్చారని విమర్శించారు. మోడీ తన పరిపాలనలో రూ.100 కోట్ల అప్పులు తెచ్చి దేశాన్ని అప్పుల భారత్ గా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ సంపదను ఆదాని, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా ధారాదత్తం చేస్తూ ఊడిగం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ పాలనలో దళిత, మైనార్టీ వర్గాలకు, మహిళలకు మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు ఉద్యోగ భద్రత కరువైందని విమర్శించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ ప్రజల పక్షాన నిలబడి పరిష్కారం కోసం ఉద్యమాలు చేసేది సిపిఐ మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, విశాలాంధ్ర ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో బెజవాడ బ్రహ్మయ్య, ఏలూరు టౌన్ రిపోర్టర్ మట్టా మాణిక్యాలరావు పాల్గొన్నారు.

విశాలాంధ్ర విలేఖరి కృష్ణ బాబుకు పరామర్శ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: విశాలాంధ్ర విలేఖరి పి. కృష్ణ బాబును సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పరామర్శించారు. మంగళవారం కృష్ణ బాబు తల్లి సుబ్బాయమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం విధితమే. బుధవారం కొయ్యలగూడెంలోని కృష్ణ బాబు కలిసి ఆయనను పరామర్శించి, కుటుంబ సభ్యులకు సాను భూతి, సుబ్బాయమ్మ మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కృష్ణ బాబును సిపిఐ కొయ్యలగూడెం మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, విశాలాంధ్ర ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో బెజవాడ బ్రహ్మయ్య, ఏలూరు టౌన్ రిపోర్టర్ మట్టా మాణిక్యాలరావు, తదితరులు పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

మంత్రి తుమ్మల సహకారంతో విజయవాడకు బస్సు సౌకర్యం

విశాలాంధ్ర - చాట్రాయి: తెలంగాణ సీనియర్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు ప్రాంతంలోని శివపురం చిన్నంపేట మీదుగా విజయవాడ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయించడం ఆనందదాయకంగా వుందని తెలుగు రైతు ఏలూరు జిల్లా అధ్యక్షులు గుత్తా వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం తెలంగాణ రాష్ట్రంలోని సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తెలంగాణలోని వేంసూరు మండలం, ఏలూరు జిల్లాలోని చింతలపూడి, చాట్రాయి మండలాల మీదుగా మారుమూల గ్రామాల ప్రజలు సుమారు 15 గ్రామాలకు చెందిన వారి సౌకర్యార్థం ఏర్పాటు చేయడం ఎన్నటికీ మరువలేమన్నారు. తాను ఈ ప్రతిపాదన తీసుకువచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా సత్తుపల్లి, నూజివీడు శాసనసభ్యులు కూడా సహాయ సహకారాలు అందించారని ప్రజల ప్రయాణ సౌకర్యాన్ని మెరుగుపరిచిన ప్రజా నాయకులను ఎప్పటికీ మరువమన్నారు.

సమాచార శాఖ ఉద్యోగినికి ఆత్మీయ సత్కారం

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్ గా పనిచేసి పదవీ విరమణ పొందిన మేడిది మల్లేశ్వరిని డిపిఆర్వో ఆర్.వి.ఎస్. రామచంద్రరావు, సహచర ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. బుధవారం స్థానిక డిపిఆర్వో కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ఆఫీసు సబార్డినేట్ యం. మల్లేశ్వరికి ఆత్మీయ వీడ్కోలు సత్కారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పౌర సంబందాల అధికారి ఆర్.వి.ఎస్. రామచంద్రరావు మాట్లాడుతూ 21 సంవత్సరాలు సమాచార శాఖలో అంకితభావంతో విధులు నిర్వహించి అందరి ఆదరాభిమానాలు పొందారన్నారు. ఆమె సర్వీసులో చేసిన సేవలు తెలియజేశారు. ప్రతి ఉద్యోగికి పదవి విరమణ అనేది సహజమని వారు సర్వీసులో ఉండగా చేసిన సేవలు సహ ఉద్యోగులకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది కె. ధనుంజయరాజు, సిహెచ్ రాంబాబు, కె. సూర్యనారా యణ, డి. శౌరి ప్రసాద్, టి. బాబూరావు, పత్తి సాగర్, ఎస్ గంగాధర్, రామారావు, పి. శారద, జివి రత్నం, ఎస్. సంధ్యాకమల తదితరులు పాల్గొన్నారు.

2024-25 వార్షిక రుణ ప్రణాళిక రూ. 16,243 కోట్లు

కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌ను జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌తో కలిసి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఆవిష్కరించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌ను నాబార్డ్ డిడియం టి అనిల్ కాంత్ రూపొందించిన ఏలూరు జిల్లా పిఎల్‌పిను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ జిల్లా ప్రగతికి సహకరించాలన్నారు. ఈ ప్రణాళికలో ప్రాధాన్యత రంగానికి మొత్తం ప్రొజెక్షన్ రూ. 16,243 కోట్లతో రూపొందించగా 2024-25 లో మొత్తం వ్యవసాయ అంచన రూ. 11,273 కోట్లతో రూపొందించారు. ఇది మొత్తం ప్రొజెక్షన్‌లో 69,40శాతం మొత్తం వ్యవసాయంలో, పంట రుణం రూ. 6,306.29 కోట్లు కాగా వ్యవసాయ టర్మ్‌లోన్ రూ. 4, 966.49 కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాలు రూ. 430.45 కోట్లు మరియు అనుబంధ కార్యకలాపాలు రూ. 7,508.93 కోట్లు కింద ఎంఎస్ఎంఇ రుణం కింద రూ. 2,240.27కోట్లగా అంచనా వేయబడింది. ఎగుమతి క్రెడిట్ రూ. 144.00 కోట్లు, విద్య కింద రూ. 88.20.కోట్లు, హౌసింగ్ రూ. 473.04 కోట్లు, బ్యాంక్ క్రెడిట్ రూ. 44.22కోట్లు, రెన్యూవబుల్ ఎనర్జీ 13.37 కోట్లు, రూ. 27.50కోట్లు కింద చూపించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ వెజ్జు వెంకటేశ్వరరావు, సభ్యులు చిట్టూరి వెంకటేశ్వరరావు, నాబార్డు డిడిఎం టి. అనిల్ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా రంగానికి, సమాజానికి యద్దనపూడి సేవలు చిరస్మరణీయం

13వ వర్ధంతిలో పలువురి నివాళి

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం : పత్రికారంగానికి, సమాజానికి యద్దనపూడి సూర్యనారాయణమూర్తి చేసిన బహుముఖ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు నివాళులు అర్పించారు. ప్రముఖ పాత్రికేయుడు, సుప్రసిద్ధ సంఘ సేవకుడు, యద్దనపూడి సూర్యనారాయణమూర్తి స్మారక ఉత్తమ జర్నలిస్ట్ పురస్కార ప్రదాన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తాడేపల్లిగూడెం జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెస్ క్లబ్, ఏ.పి.యు.డబ్ల్యు.జే. పశ్చిమ గోదావరి జిల్లాశాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన కార్యక్రమానికి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తమ్మిశెట్టి రంగసురేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రంగస్థల, కళా పరిషత్తుల సమాఖ్య అధ్యక్షుడు బుద్ధాల వెంకట రామారావు మాట్లాడుతూ పాత్రికేయుడిగా, సామాజిక కార్యకర్తగా, కళాసేవకునిగా యద్దనపూడి చేసిన బహుముఖ సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన పాటించిన వృత్తి విలువలను, సేవాస్ఫూర్తిని నేటితరం పాత్రికేయులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ యద్దనపూడి పత్రికా రచనకే పరిమితం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడారని అన్నారు. త్యాగరాజ గానసభ అధ్యక్షుడు గరికపాటి బాపయ్య శర్మ మాట్లాడుతూ 1957లో లలిత కళాసమితి స్థాపన ద్వారా ఉద్దండులైన సంగీత విద్వాంసులను తాడేపల్లిగూడెం తీసుకు వచ్చిన ఘనత యద్దనపూడికి దక్కుతుందన్నారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ ఆర్టీసీ సేవలను మెరుగుపరచడంలో యద్దనపూడి విశేషకృషి చేశారని అన్నారు. ఐజేయూ జాతీయ కార్యదర్శి డి. సోమసుందర్ మాట్లాడుతూ యద్దనపూడి పేరిట జిల్లాస్థాయి ఉత్తమ జర్నలిస్ట్ పురస్కారాన్ని గత పన్నెండు సంవత్సరాలుగా నిరాటంకంగా ప్రదానం చేయడానికి యద్దనపూడి కుటుంబ సభ్యులు అందిస్తున్న సహకారం కీలకమని అన్నారు. ఏ.పి.యు.డబ్ల్యు.జే. రాష్ట్ర నాయకుడు జి.వి.ఎస్.ఎన్.రాజు, జిల్లా కార్యదర్శి గజపతి వరప్రసాద్, జిల్లా కోశాధికారి ముత్యాల శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తమ్మిసెట్టి రంగ సురేష్, కార్యదర్శి గొలిమే బుజ్జిబాబు, ప్రెస్ క్లబ్ పూర్వాధ్యక్షులు చిక్కాల రామకృష్ణ, సీనియర్ పాత్రికేయుడు చిట్యాల రాంబాబు, పాలడుగు సతీష్, భీమవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కదలి వరప్రసాద్, యద్దనపూడి తనయుడు యద్దనపూడి సుబ్బారావు, యద్దనపూడి కుమార్తె వై.వి.ఆర్.లక్ష్మి తదితరులు యద్దనపూడి సేవలను కొనియాడుతూ నివాళులు అర్పించారు. యద్దనపూడి సూర్యనారాయణ మూర్తి స్మారక ఉత్తమ జర్నలిస్ట్ పురస్కారాన్ని 2023 వ సంవత్సరానికి బుట్టాయిగూడెం న్యూస్ టుడే విలేఖరి మామిడిసెట్టి శ్రీరాం ప్రసాద్‌కు అతిథులు బుద్ధాల వెంకటరామారావు, చింతకాయల బాబూరావు చేతులమీదుగా అంద చేసారు. అవార్డు కింద రూ.5116 నగదు పారితోషికం, జ్ఞాపిక, నూతన వస్త్రాలు, శాలువా, పూలమాలలతో సత్కరించారు.

ఇంటి లింకు దస్తావేజులు పడిపోయినవి

కొయ్యలగూడెం గ్రామానికి చెందిన **గూడిపాటి షణ్ముఖ వెంకట రాఘవ (తండ్రి) సాంబశివరావు , షణ్ముఖ వెంకట రాఘవకు** చెందిన సర్వే **నెంబర్ 317 /లో 217 గజాల** స్థలం కలదు, దీనిలో లింకు దస్తావేజుల **నెంబర్ 3076 / 2000** గల దస్తావేజులు కొయ్యలగూడెం గ్రామంలో **షణ్ముఖ వెంకట రాఘవ** ఇంటివద్ద నుండి సెంటర్‌కు వెళ్ళు చుండగా మార్గమధ్యలో పడిపోయినవి దొరికినవారు ఈ క్రింది అడ్రస్‌కు తెలుపగలరు.

గుడిపాటి షణ్ముఖ వెంకట రాఘవ
తండ్రి సాంబశివరావు, కొయ్యలగూడెం
గ్రామం కొయ్యలగూడెం మండలం ఏలూరు
జిల్లా 534312 ఆంధ్రప్రదేశ్.
సెల్ నెంబర్ : 9346088035.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం

విశాలాంధ్ర-ఏలూరు: ఇటీవల విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాపై ఏమైనా అభ్యంతరాలువుంటే 4,5 రోజుల్లో తెలియజేయాలని రాజకీయ పక్షాల ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సూచించారు. ఏలూరు జిల్లా ఓటర్ల జాబితాలోని అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో బుధవారం జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో రమాదేవి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు డి. రత్నబాబు(బిఎస్పీ), నెరుసు నెలరాజ (బిజెపి), పి. ఆదిశేషు(సిపిఎం), ఎస్. బాబూ ప్రసాద్(కాంగ్రేస్), ఆర్. సత్యనారాయణ(ఆమ్ ఆద్మీ), పాలి ప్రసాద్(టిడిపి), కలవకొల్లు సాంబ (వైఎస్ఆర్ సిపి) తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ చివరి నిమిషం వరకు వేచిచూడకుండా బూత్ లెవల్ ఏజెంట్లతో తుది ఓటర్ల జాబితాతో ఆయా ఇళ్లను సందర్శించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యేవరకు రాజకీయ పక్షాల ప్రతినిధులతో ఓటర్ల జాబితా తదితర అంశాలపై వారం వారం సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు.

బీసీలను నమ్మించి మోసం చేసిన ముఖ్యమంత్రి

విశాలాంధ్ర - కామవరపుకోట : మండలంలోని పాతురులో మండల టిడిపి అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ ఆధ్వర్యంలో నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు జుజ్జిరి బాబ్జి అధ్యక్షతన జయహో బిసి మండల సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండలంలోని బీసీ నాయకులతో పాటు నియోజకవర్గ పరిధిలోని ముఖ్య బిసి నాయకులంతా హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యాం చంద్ర శేషు మాట్లాడుతూ ఐక్యంగా కలిసి ఉన్న బీసీలను కార్పొరేషన్స్ అంటూ విడగొట్టి ఎన్నికల్లో 129 కార్పొరేషన్లు పెడతా ఒక్కో కార్పొరేషన్‌కి 1000 కోట్లు కేటాయిస్తానని చెప్పి ఒక్క రూపాయి కూడా కేటాయింపు చేయకుండా బీసీలను తీవ్రంగా మోసం చేసారని తెలిపారు. జుజ్జురి బాబ్జి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం పాలనలో బిసిలకు ఒక్క రూపాయి కూడా రాయితీ రుణాలు ఇవ్వకుండా మోసం చేసారన్నారు. మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ మాట్లాడుతూ బిసిలకు రిజర్వేషన్లు కల్పించి చట్ట సభల్లో స్థానిక సంస్థల్లో అనేక అవకాశాలను టిడిపి కల్పిస్తే జగన్ పాలనలో 10 శాతం రిజర్వేషన్లు కోత పెట్టి అక్షరాల 16800 పదవులను బిసిలకు రాకుండా అన్యాయం చేసిన బిసి వ్యతిరేకి జగన్ అని అన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి, రాష్ట్ర కార్యదర్శి చిట్టిబొయిన రామలింగేశ్వర రావు, మండల బీసీసెల్ అధ్యక్షుడు దొడ్డకుల గంగాధరరావు, బీసీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో అకడమిక్ బలోపేతానికి అధ్యాపకుల నియామకం

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: ఆర్జీయూకేటీ నూజివీడు ట్రిపుల్ ఐటీ లో అడ్మినిస్ట్రేటివ్, అకాడమిక్ విభాగాల్లో విధులు బలోపేతానికి ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. చంద్రశేఖర్ బుధ వారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. దానిలో భాగంగా సి ఎస్ ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న టి చంద్రశేఖర్‌ను ఇన్‌చార్జి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా నియమించారు. ప్రొఫెసర్ బి.శ్రీనాదును ఇన్‌చార్జి ఫైనాన్స్ ఆఫీసర్ గాను, ఎన్. రత్నాకర్‌ను ఇన్‌చార్జి డీన్ అకడమిక్ ఆఫీసర్ గా నియమించారు. వీరు ఈ పదవుల్లో ఏడాదిపాటు కొనసాగుతారని డైరెక్టర్ పేర్కొన్నారు.

గణితం బోధించే ఉపాధ్యాయుల నుండి దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర-టి నరసాపురం: తాత్కాలిక ప్రాతిపదికన గణితం బోధించే ఉపాధ్యాయుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి ఎస్ బి శంకర రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లా అప్పలరాజు గూడెం గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు గణితం బోధించడానికి పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో 50శాతం, బిఇడిలో 50శాతం మార్కులు అర్హత కలిగిన వారు ఫిబ్రవరి 2వ తేదీన అన్ని సర్టిఫికెట్లతో పాఠశాలకు హాజరు కావాలని ఆయన తెలిపారు . మరిన్ని వివరాలకు పాఠశాల పని వేళల్లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

టీడీపీ అభ్యర్థి ఎవరు?

నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్

విశాలాంధ్ర- చాట్రాయి: తెదేపాకి నూజివీడులో నిలబడే అభ్యర్థి ఎవరో.... ఎంపీ అభ్యర్థి ఎవరో... నేటికీ నిర్ణయించ లేని వాళ్లు... పలికే ప్రగల్భాలను ఎవరు నమ్ముతారని నూజివీడు శాసనసభ్యులు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఎద్దేవ చేశారు. బుధవారం చాట్రాయి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ. నిరుపేదల జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపిన జగన్‌ను ఓడించడం తెలుగుదేశం తరం కాదన్నారు. నూజివీడులో ఎమ్మెల్యేకు నిలబడే అభ్యర్థి ఎవరో.... ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి ఎవరో ఆ పార్టీ తెలుసుకోలేని పరిస్థితిలో ఉందన్నారు. 1119 మహిళా స్వయం సహాయక సంఘాలలో ఉన్న 11883 మందికి 8 కోట్ల 89 లక్షల 57వేల ,815 రూపాయలు వచ్చాయని తెలిపారు. సభా వేదికపై లబ్ధి పొందిన మహిళలతో మాట్లాడించారు. కార్యక్రమంలో ఏపీ కోపరేటీవ్ యూనియన్ చైర్మన్ యూనియన్ చైర్మన్ దేశి రెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ లంక నిర్మల తదితరులు పాల్గొన్నారు.

అవార్డుకు సమాచారాన్ని సమర్పించాలి

విశాలాంధ్ర - భీమవరం : జిల్లాలోని వివిధ శాఖల్లో కేంద్ర పథకాల అమలును వినూత్నంగా చేపట్టిన శాఖలు పీఎం అవార్డు నామినేషన్లుకు సమాచారాన్ని సమర్పించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ప్రధానమంత్రి అవార్డ్స్ నామినేషన్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎక్సలెన్సీ సంబంధించి ప్రధానమంత్రి అవార్డ్స్ కొరకు నామినేషన్లు కోరినట్టు తెలిపారు. కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాలు, అన్ని జిల్లాలు ఈ ప్రధానమంత్రి అవార్డులకు పాల్గొంటాయన్నారు. పరిపాలనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లాకు ప్రధానమంత్రి అవార్డును ప్రధానమంత్రి చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సిపిఓ కె.శ్రీనివాసరావు, డీఈవో ఆర్. వెంకటరమణ, అడిషనల్ డిఎం అండ్ హెచ్ ఓ భాను నాయక్, జిల్లా అటవీ శాఖ అధికారి ఆశ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం -ఆంధ్ర క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా మొదటి స్థానంలో ఉంచాలి

విశాలాంధ్ర-ఏలూరు: ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయిలో ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి అకాక్షించారు. బుధవారం స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జిల్లాస్థాయి ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీలను జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ ,జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి బి.లావణ్యవేణి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఏలూరు జిల్లాను ఆడుదాం-ఆంధ్ర లో మొదటిస్థానం సాధించడానికి క్రీడాకారులు కష్టంతో కాకుండా ఇష్టంతో ఆడాలని చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో గ్రామీణ, మండల, నియోజకవర్గ క్రీడాపోటీలు జరిగాయని నియోజకవర్గంలో గెలుపొందిన క్రీడాకారులను జిల్లాస్థాయిలో క్రీడల్లో పాల్గొని గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయిలో పంపడం జరుగుతుందని తెలిపారు. విద్యతోపాటు క్రీడల్లోకూడా ప్రోత్సాహం చూపించాలని దీనిద్వారా మానసిక ప్రశాంతత, ధృడసంకల్పం కలుగుతుందని అన్నారు. ఈ క్రీడాపోటీల్లో క్రికెట్, కో-కో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ క్రీడా రంగాన్ని ప్రోత్సహించే దిశలో ముఖ్యమంత్రి జగన్ ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమం ఏర్పాటు చేశారని, దీనికి జిల్లాలో విద్యార్థులు మంచి స్ఫూర్తిని ఇచ్చారని అన్నారు. అనంతరం క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మహిళల వాలీబాల్ క్రీడను జాయింట్ కలెక్టర్, చైర్ పర్సన్ ఆడి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమీషనరు ఎస్. వెంకటకృష్ణ, ఆర్డిఓ ఎన్.ఎస్.కె. ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు మానవ మనుగడకు మార్గదర్శకం

విశాలాంధ్ర-నరసాపురం : నర్సాపురం పట్టణ పరిధిలోని క్రీస్తు లూథరన్ దేవాలయము (ఎ క్లాస్ పేరిష్)శత వార్షికోత్స కృతజ్ఞత ఆరాధన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రపంచంలో మానవునికి సంబంధించి మానవ జీవిత విధి విధానాల గురించి ఏసుక్రీస్తు తాను అనుభవించి మానవాళికి మార్గం నిర్దేశించారన్నారు. ఈ భూమిపై ఎంతో విలువైనది మానవ జన్మ ఈ జన్మలో దైవచింతలతో పాటు సమాజంలోని ఇతరుల పట్ల మానవీయత విలువలను కలిగి ఉండాలని తద్వారా మాత్రమే మానవ జీవితానికి పరిపూర్ణత ఏర్పడుతుందని చెప్పిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు పాల్గొన్నారు.

మొదటి రోజు మనసారా ఆసరా కార్యక్రమాలు

విశాలాంధ్ర - ఆచంట : మాజీ మంత్రి జిల్లా పార్టీ అధ్యక్షులు ఆచంట నియోజకవర్గ ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీ రంగనాథరాజు ఆధ్వర్యంలో మొదటి రోజు ఏర్పాటు చేసిన మనసారా ఆసరా కార్యక్రమాన్ని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలా రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఆచంట నియోజవర్గం స్థాయిలో ఈ కార్యక్రమానికి డ్వాక్రా అక్కా చెల్లెమ్మలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. నాలుగు మండలాల నుంచి సుమారు 5000 మంది కార్యక్రమానికి పాల్గొన్న డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు భోజనం పెట్టి చీర అందించారు.

రామాలయానికి విచ్చేసిన జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర - లింగపాలెం : జాయింట్ కలక్టర్ లావణ్య వేణి ముడిచర్లలో పర్యటించారు. గ్రామంలోని రామాలయంలో విగ్రహాలకు కిరీటాలు అందించాలని ఆలయ కమిటీ వారు ఆహ్వానించగా ఈమె విచ్చేశారు. సీతా రాములకు, లక్ష్మణ, ఆంజనేయులకు కిరీటాలు అమర్చారు. కన్నుల పండుగగా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ రావి రమాదేవి కొండలు, ఆలయ కమిటీ నాయకులు తాళ్ళూరి సత్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్‌ను సన్మానించారు. గ్రామానికి విచ్చేసిన ఈమెకు పలు సమస్యలు వివరించగా పరిష్కరిస్తానని తెలిపారు.

నిధులున్నా సద్వినియోగం చేసుకోలేని అసమర్ధ ఎమ్మెల్యే ముదునూరి

విశాలాంధ్ర-మొగల్తూరు: తీర ప్రాంత వాసుల చిరకాల కోరిక మొగల్తూరు మండలంలోని మోడి వంతెన, వియర్ ఛానల్ ప్రాంతాలను బుధవారం నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు మాట్లాడుతూ సముద్ర తీరప్రాంత గ్రామాలను మండల కేంద్రం మొగల్తూరుతో అనుసంధానం చేసేందుకు మొగల్తూరు - మోడీ గ్రామాల మధ్య వంతెన నిర్మించాలని ప్రజలు ఐదు దశాబ్దాలుగా కోరుతున్నారని అన్నారు. సముద్ర తీర ప్రాంత గ్రామాల్లో 4 వేల ఎకరాల భూములకు సాగునీరు అందించేందుకు ఈ నిర్మాణం వియర్ ఛానల్ దోహద పడుతుందని అన్నారు. వియర్ ఛానల్ నిర్మాణం చేపట్టింది టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నని గుర్తు చేసారు. టీడీపీ అనంతరం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వియర్ ఛానల్ నిర్మాణానికి నీళ్ళోదిలిందని అన్నారు. ముందుగా శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఆంద్రాజు రామన్న తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ దొంగ అరెస్ట్

విశాలాంధ్ర-వీరవాసరం: ఇటీవల వేరు వేరు చోట్ల మోటారు వాహనాలను దొంగతనం చేస్తున్న మండలంలోని మడుగు పోలవరం పంచాయతీ పరిధిలోని జొన్నలపాలెం గ్రామానికి చెందిన వేంద్ర చంద్రశేఖరరావును అరెస్ట్ చేసి అతని వద్ద నుండి దొంగిలించిన మోటారు వాహనాలను రికవరీ చేసినట్లు వీరవాసరం ఎస్ఐ పి.రమేష్ ఒక ప్రకటన లో తెలిపారు. ఇతనిపై గతంలో కూడా మోటారు వాహనాల దొంగతనం కేసు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ కనపరిచిన భీమవరం రూరల్ సర్కిల్ ఎస్ఐ వై.సత్య కిశోర్, వీరవాసరం ఎస్ఐ పి. రమేశ్, మరియు సిబ్బంది ని జిల్లా ఎస్పీ ఉప్పాడ రవి ప్రకాష్ అభినందించారు.

టీడీపీలో చేరిక

విశాలాంధ్ర - తణుకు : పట్టణ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు ఆకుల వెంకటేష్ ఆధ్వర్యంలో తణుకు పట్టణం నుంచి పలువురు యువకులు బుధవారం తెలుగుదేశం పార్టీలోకి చేరారు . ఈ సందర్భంగా తణుకు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ శాసన సభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ వారికి పార్టీ కండువా కప్పి తెలుగుదేశం కుటుంబంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు పూర్తిఅయ్యిందని ఈ నాలుగున్నర సంవత్సరాలలో యువత భవిష్యత్తును నాశనం చేశాడని విమర్శించారు . చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ లు ఇద్దరు కలిసి ఏర్పరిచే ప్రభుత్వం ద్వారా యువతకు న్యాయం జరుగుతుందని నమ్మి తెలుగుదేశం పార్టీలోకి వచ్చామని అన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణ ప్రధాన కార్యదర్శి ఓమ్మి రాంబాబు, నియోజవర్గ ప్రచార కార్యదర్శి తాతపూడి మారుతీరావు, జక్కంశెట్టి వెంకటేష్, మల్లిన రాధాకృష్ణ , సిర్రా సుధాకర్, నక్కా ఈశ్వరప్రసద్, తమరపు పల్లపురావు, మాజి కౌన్సిరల్ సప్పా వీరారఘువులు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాకు చెందిన ఎన్నికల సామాగ్రి భద్రపరిచే గోదాంను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సాధారణ తనిఖీచేసే ప్రక్రియలో బాగంగా సందర్శించడం జరిగిందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నున్న ఈవిఎం యంత్రాలు, వివిప్యాట్ భద్రపరిచే గోదాం ను సందర్శించి గోదాముకు వేసిన సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిష్టర్‌లో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఎప్పటి కప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాం ను క్షుణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవిఎం గోదాం వద్ద ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

చిరుధాన్యాలతో రుచికరమైన వంద రకాల వంటలు పుస్తకం అవిష్కరణ

విశాలాంధ్ర - ఏలూరు: జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి పూర్తి కమీషన్ సొసైటీలకు అందించే చర్యలు తీసుకోవాలని జిల్లా సహకారశాఖ అధికారిని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు.బుధవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సలహా మండలి సమావేశంలో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ప్రచురించిన చిరుధాన్యాలతో రుచికరమైన వంద రకాల వంటలు పుస్తకాన్ని జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ తో కలిసి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఆవిష్కరించారు. సమావేశంలో సభ్యులు చిట్టూరి వెంకటేశ్వర రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై. రామకృష్ణ, జలవనరుల శాఖ ఎస్ ఇ కె. శ్రీనివాసరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు మంజూ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో మార్పులు

విశాలాంధ్ర-నరసాపురం: విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులు, మేజర్, మైనర్, సబ్జెక్ట్స్, ఇంటర్ షిప్ ప్రాజెక్ట్స్, స్కిల్స్ అభివృద్ధి చేసుకోవడం ద్వారా నాణ్యమైన విద్యను పొందవచ్చని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహన్ రావు అన్నారు. వై. యన్. కళాశాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కే. రామ్మోహనరావు ఆయన మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా నుంచి నేక్ ఎం గ్రేడ్ శ్రీ వై యన్ కళాశాలను ఎంపిక చేసామని విద్యార్థినీ విద్యార్థులు అభివృద్ధి పొందాలంటే ముఖ్యమైన విషయాల అవసరమని అవి స్కిల్స్ నవ కల్పనలు యువతరం ఆలోచన విధానం ఈ మూడింటిని మార్చుకుంటూ కొత్త ఆలోచనలతో అనేక నవకల్పనలు చేయడం ద్వారా అనేక కొత్త వ్యాపారాలు స్టార్ అప్స్ వస్తున్నాయి ప్రపంచానికి నిన్ను నువ్వు పరిచయం చేసుకోవాలంటే నీ ఆలోచనలను వదిలిపెట్టి నీ అవసరం ప్రపంచానికి సంస్థలకు ఉన్నదని నిరూపించుకోవాలంటే ముందుగా నీలో స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు.

వై. యన్. కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డా. చినమిల్లి సత్యనారాయణరావు మాట్లాడుతూ ఉన్నత విద్యా మండలి తీసుకొని వస్తున్న సంస్కరణలు వలన ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాలను పెంచవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏకడమిక్, రీసర్చ్ ఎడ్వైజర్, ఆర్.వి. సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపల్ డా.చింతపల్లి కనకారావు, పి జి డైరెక్టర్ డాక్టర్ ఎన్. చింతారావు, కళాశాల డీన్ డా. గంధం రామకృష్ణ, ఇంచార్జ్ డైరెక్టర్ డా. ఆర్. పార్థసారథి, వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకటరత్నం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విధార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలి

విశాలాంధ్ర-ఏలూరు: రహదారి కూడళ్ళను దాటేటప్పుడు తప్పకుండా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలని మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ కెవిఎస్. ప్రసాద్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్స వాల్లో భాగంగా బుధ వారం వట్లూరు సిద్దార్థ విద్యాలయ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో రహదారి భద్రతపై అవగహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరు విద్యార్థి దశనుంచే రహదారి భద్రతా నియమాలపై, ట్రాఫిక్ సిగ్నల్స్ పై అవగాహన కలిగి ఉండటం వలన రోడ్డు ప్రమాదాలను నివారించ వచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ జి.ప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్లు అజ్మీరా బద్దు, జి.స్వామి, రోడ్డు భద్రతా వైద్యురాలు జి. మౌనిక, ప్రిన్సిపల్ పి.ఎస్.ఎన్.కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షల ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-ఏలూరు: దెందులూరు మండలం, చల్ల చింతలపూడి గ్రామానికి చెందిన ముమ్మడి వెంకట సత్య నారాయణ కుమార్తె ముమ్మడి మాధవికి వైద్య విద్య నిమిత్తం ముఖ్య మంత్రి జగన్ దృష్టికి తీసుకురాగా ఆమెకు రూ. 10 లక్షలు మంజూరు చేసినారు. సదరు మొత్తమును జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వారి ఆదేశముల మేరకు బుధవారం జాయింట్ కలక్టర్ బి.లావణ్య వేణి ఛాంబర్ లో పది లక్షల రూపాయల చెక్కును అంద చేశారు.

వీధి కుక్కలపై చర్యలేవి ?

విశాలాంధ్ర-గోకవరం: గోకవరం గ్రామంలో ఇటీవల కాలంలో చిన్నపిల్లలపై, మహిళలపై వీధి కుక్కల దాడి బాగా అధికమైందని దీనిని అధికారులు అరికట్టాలని తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ జెడ్పిటిసి పాలూరి బోసుబాబు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా గ్రామంలో వీధి కుక్కలు స్వైర వ్యవహారం చేస్తున్నాయని చిన్నపిల్లలను, మహిళలను భయంకరంగా గాయపరిస్తూ భీభత్సం సృష్టిస్తున్నాయని వీటిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని బోసుబాబు తెలిపారు.ఏదైనా ప్రాణ నష్టం జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని బోసు బాబు అధికారులను ప్రశ్నించారు.

సమస్యల పరిష్కారానికై జిజిహెచ్ శానిటేషన్ వర్కర్ల ఆందోళన

విశాలాంధ్ర - కాకినాడ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్స్ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సిహెచ్ విజయ్ కుమార్, మహిళా నేత జె లక్ష్మీప్రియలు మాట్లాడుతూ 2021 నుండి జిజిహెచ్‌లో శానిటేషన్ నిర్వహణ కాంట్రాక్టు పొందిన కృష్ణా కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు గతంలో ఎన్నడూ లేని విధంగా పిఎఫ్ చెల్లింపుల్లో యజమానులు చెల్లించవలసిన వాటా కూడా కార్మికుల జీతాల నుండి కత్తిరింపులు చేసారని తెలిపారు. ఇప్పటి వరకు చాలా సార్లు విన్నవించిన తరువాత ఆందోళన బాట పట్టామన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేసేవరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, జిల్లా కోశాధికారి మలక వెంకటరమణలతో పాటు యూనియన్ నాయకులు ఆర్ రమేష్, జె శేషు, ఎస్ వాసు, కృష్ణవేణి, రమణమ్మ, పుష్ప, తలుపులమ్మ, భాగ్యలక్ష్మి, డి దుర్గా ప్రసాద్, బి శ్రీకాంత్, ఎం ఏసు, ఎం రవి, వసంత్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో బంగారం చోరీ

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని ర్యాలీ గ్రామ శివారు బుల్లియ్య రేవులో ఒక ఇంటి తాళం బద్దలు కొట్టి 15 గ్రాముల బంగారం దొంగతనం చేశారని అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బివై కిరణ్ కుమార్ తెలిపారు. ఆధారాల సేకరణ కోసం క్లూస్ టీమ్ సిబ్బంది మరియు ఎస్సై ప్రవీణ్ కుమార్ వచ్చి వేలి ముద్రలు సేకరిస్తున్నారు. చోల్లంగి బంగారయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు ప్రవేశించి బంగారం దొంగలించారు. బాధితుడు ఆత్రేయపురం స్టేషన్‌కి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బివై కిరణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. ఉదయం11 గంటలకు బయటకు వెళ్లి తిరిగి 12.30కు వచ్చే సరికి దొంగతనం జరిగింది. దొంగతనాలు మరియు సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గంగిరెడ్డి కుటుంబానికి ముద్రగడ పరామర్శ

విశాలాంధ్ర - సామర్లకోట : ఇటీవలి మృతి చెందిన గంగిరెడ్డి స్వామి నాయుడు కుమారులైన వెంకటరమణ, బలరాం, కృష్ణమూర్తిలను మాజీ

మంత్రి కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం సామర్లకోటలో చైర్పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి ఇంటి వద్దకు చేరుకుని పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. ముద్రగడతో గంగిరెడ్డి కుటుంబ సభ్యులకు మంచి సంబంధాలు కలిగి ఉన్నారు. కుటుంబ సభ్యులతో సుమారు గంటపాటు మాట్లాడారు.

కొవ్వూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అరుణకుమారి దరఖాస్తు దాఖలు

విశాలాంధ్ర-కొవ్వూరు : రాబోయే శాసన సభ ఎన్నికలు నిమిత్తం కొవ్వూరు నుండి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేయుటకు విజయవాడ

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి తెలిపారు. కొవ్వూరులో ఆమె బుధవారం మాట్లాడుతూ ఈసందర్భంగా రాష్ట్రంలో డా వై ఎస్ రాజశేఖరరెడ్డి తనయ షర్మిల రెడ్డి కాంగ్రెస్ పార్టీ లో చేరిన తరువాత మరింత ముందుకు వెళ్ళుటకు అవకాశం వచ్చింది అని అరుణకుమారి అన్నారు. ఆమె వెంట పి సిసి డెలిగేట్ గెద్దం సాయి బాబా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాలకుర్తి ప్రభాకర్ చౌదరి, జిల్లా ఉపాధ్యక్షులు కొణిదల శ్రీనివాస్, చాగల్లు మండలం ప్రెసిడెంట్ బోనిగే రాంబాబు, కొయ్యే వెంకట్ రావు, అరిగెల శ్రీనివాస్, సత్య నారాయణ ఉన్నారు.

వైసీపీ విజయానికి పనిచేయాలి

విశాలాంధ్ర -కొవ్వూరు : వైసీపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. బుధవారం కొవ్వూరు మండలం కాపవరం, చాగల్లు గ్రామాలలో తలారి వెంకట్రావు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రాబోయే ఎన్నికలలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మళ్ళీ అధికారం చేపట్టే విధంగా గోపాలపురం నుండి తనను కొవ్వూరు పంపించారని తెలిపారు.

బదిలీపై వెళుతున్న ఎంపీడీవోకు చిరు సత్కారం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఎంపీడీవోగా పనిచేస్తున్న యమ్‌వీఆర్ కుమార్ బాబు ఎన్నికల ప్రక్రియలో భాగంగా కృష్ణాజిల్లాకు బదిలీపై వెళుతున్న సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, వైసిపి సీనియర్ నాయకులు, మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, గ్రామ పంచాయితీ కార్యదర్శులు కలిసి ఎంపీడీవో కుమార్ బాబుని శాలువాలు, బొకేలుతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్నెంట్ జే శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ మూర్తి, జూనియర్ అసిస్టెంట్ సురేష్, పంచాయతీ కార్యదర్శులు డి శ్రీనివాసరావు, ఏఎస్ఎన్ మూర్తి, బి. వీరబాబు, లక్ష్మీనారాయణ గంగాభవాని, వైసిపి నాయకులు పిన్నిసెట్టి ప్రకాష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : తెలుగుదేశం పార్టీతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని ప్రత్తిపాడు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ వరుపుల సత్యప్రభ అన్నారు. ఏలేశ్వరంలో బుధవారం జరిగిన జయహో బీసీ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సత్య ప్రభ మాట్లాడుతూ టిడిపి హయాంలో ఆదరణ

పథకం ద్వారా చేతి వృత్తిదారులకు పనిముట్లు, రైతులకు ట్రాక్టర్లు ఇతర సామాగ్రి అందజేయడం జరిగిందని అన్నారు. బీసీ యువత ఉపాధి కోసం రాయితీపై ఆటోలు, లారీలు, కుటీర పరిశ్రమలకు యంత్ర సామాగ్రి అందజేస్తే ప్రస్తుత ప్రభుత్వం అవన్నీ తుంగలోకి తొక్కిందన్నారు. చంద్రన్న బీమా ద్వారా ఎవరైనా మృతి చెందితే మట్టి ఖర్చులకు వెంటనే 5 వేల రూపాయలు, అనంతరం 2 లక్ష రూపాయలు కుటుంబానికి భరోసా ఇచ్చిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. బీసీ, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లక్షల రూపాయలు రుణాలు అందజేసి అనేక కుటుంబాలు ఆర్థిక అభివృద్ధి చెందేలా చంద్రబాబు చర్యలు తీసుకున్నారన్నారు. బీసీలపై కక్షపూరిత చర్యలకు పాల్పడి మాజీ బీసీ మంత్రులపై అక్రమ కేసులు బనాయించిన ఘనత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నిధులు, విధులు లేకుండా కులాల ప్రాతిపదికన కార్పొరేషన్ ఏర్పాటు చేస్తుంది తప్ప ఒక్క రూపాయి ఆ కులాలకు అందలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నుదన్నుగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్చి 22 నుంచి ఉత్సవాలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం ఎర్నగూడెంలో నూతనంగా నిర్మించిన శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం విగ్రహ ప్రతిష్ట మార్చి 22 నుండి 25వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని సిద్ధాంతి రావిపాటి వెంకట వరప్రసాద్ తెలిపారు పారిశ్రామికవేత్త శ్రీకాకుళపు కాశీ విశ్వనాథం దాదాపు కోటి 50 లక్షల రూపాయలు వ్యయంతో ఆలయాన్ని నిర్మించారు బుధవారం సాయంత్రం ఎర్నగూడెంలో ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ముహూర్త నిర్మించారు చాగల్లు మండలం మార్కొండపాడు గ్రామానికి చెందిన సిద్ధాంతి రావిపాటి వెంకట వరప్రసాద్ ముహూర్తం పెట్టారు 2024 మార్చి 25 పాల్గొన్న మాసం పౌర్ణమి రోజు ఉదయం 8 గంటల 21 నిమిషములకు ఉత్తరా పాల్గొని నక్షత్రమున ముహూర్తం నిర్ణయించారు ఈ సందర్భంగా ఆలయం నిర్మాణం దాత శ్రీకాకుళపు కాశీ విశ్వనాథ మాట్లాడుతూ ఎర్నగూడెంలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని కోరికతో గ్రామస్తుల సహకారంతో ఆలయాన్ని నిర్మించినట్లు తెలిపారు మార్చి 22వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఆలయం వద్ద వివిధ పూజా కార్యక్రమాలు హోమాలు నిర్వహిస్తామని తెలిపారు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి విగ్రహం సలహాలు విగ్రహం ఉంటుందని తెలిపారు ఆరు అడుగుల మూడు అంగుళాలు ఎత్తు విగ్రహం ఉంటుందని తెలిపారు స్వామివారి వస్త్రా స్థలంలో చతురస్రాకారంలో నాగలక్ష్మి అమ్మవారు ఉంటారని తెలిపారు తిరుమల తిరుపతి దేవస్థానంలో నిత్యం జరిగే పూజా విధానం ఈ ఆలయంలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళపు వెంకట నరసింహారావు శ్రీకాకుళపు కాళీకృష్ణ తీగల బలరామయ్య నువ్వులు వెంకట్రావు నువ్వులు శ్రీనివాస్ బల్ల వెంకటేశ్వరరావు నరహరిశెట్టి సుధాకర్ పత్తిపాటి హరినాథ్, గద్దె శ్రీనివాస్, స్వామీజీ, రవికుమార్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

విద్య నిమిత్తం ఆర్థిక సహాయం

విశాలాంధ్ర -ఏలూరు: ఏలూరు సి ఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పాతూరి సాయి హర్షిని కళాశాల ఫీజు నిమిత్తం మాజీ పార్లమెంట్ సభ్యులు మాగంటి బాబు కుమార్తె మాగంటి శ్రీరవళి,తన సొంత నిధుల నుంచి రూ. 65వేలు అందజేశారు.

హెూండా ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన

విశాలాంధ్ర-రాజమండ్రి: ప్రతి వ్యక్తి యొక్క భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఉంటుందని హెూండా మోటార్స్ స్కూటర్ ఇండియా హెచ్ఎంఎస్ఐ అభిప్రాయపడింది. రోడ్డు భద్రతపై అవగాహన లక్షలాది మంది పౌరులకు చేరేలా చేసేందుకు, దేశంలోని వివిధ ప్రాంతాలలో తరచూ రోడ్డు భద్రత అవగాహన ప్రచారాలను సంస్థ నిర్వహిస్తోంది. అటువంటి ప్రచారం ఇటీవల రాజమండ్రి నగరంలో జరిగింది. ఈ కార్యక్రమం లో పాల్గొన్న వారిపై శాశ్వత ప్రభావాన్ని చూపింది. భాష్యం పబ్లిక్ స్కూల్ మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా హెచ్ఎంఎస్ఐ అపూర్వమైన మైలురాయిని సాధించింది. ఇక్కడ అది 2100కంటే ఎక్కువ మంది పాఠశాల విద్యార్థులు మరియు సిబ్బంది సభ్యుల క్రియాశీల భాగస్వామ్యాన్ని చూసింది. ఈ ప్రచారంలో భాగంగా స్లోగన్ రైటింగ్, పోస్టర్ మేకింగ్ పోటీ, రోడ్ సేఫ్టీ క్విజ్ మరియు ఆర్టికల్ రైటింగ్ కాంపిటీషన్ వంటి కార్యకలాపాలను నిర్వహించారు. పిల్లలే ఈ సమాజానికి భవిష్యత్తు అని హెచ్ఎంఎస్ఐ బలంగా విశ్వసిస్తోంది మరియు రోడ్డు భద్రతపై ప్రాథమిక దశలోనే వారికి అవగాహన కల్పించడం వల్ల రోడ్డు ప్రమాదాలు లేకుండా చేయడంలో దోహదపడుతుందని నమ్ముతుంది. ఇది తరచూ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుంది. పిల్లల నుండి యువత వరకు అనేక రకాల వయస్సు వర్గాలకు మరియు పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలలో ఈ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

నిబద్ధతగల కమ్యూనిస్టు రామసుబ్బయ్య



విశాలాంధ్ర-చల్లపల్లి : నిబద్ధతగల కమ్యూనిస్టు కామ్రేడ్ మల్లుపెద్ది రామసుబ్బయ్య అని సీపీఐ, రైతు సంఘం నాయకులు పరుచూరి శ్రీనివాసరావు ప్రశంసిం చారు. దివిసీమ కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకుడు, కృష్ణా జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్, వక్కలగడ్డ పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు మల్లుపెద్ది రామ సుబ్బయ్య 4వ వర్ధంతి మండల పరిధిలోని వక్కలగడ్డలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాసరావు మాట్లాడుతూ కామ్రేడ్ రామసుబ్బయ్య నిబద్ధతగల కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, పేద ప్రజలందరి వాడీగా ప్రశంసలందుకున్నారని కొనియాడారు. పార్టీ అగ్ర నాయకులు కామ్రేడ్ చండ్ర రాజేశ్వరరావు వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న రామసుబ్బయ్య అనేక భూ పోరాటంలో కీలక భూమిక పోషించారని అన్నారు. వక్కలగడ్డ గ్రామాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దటంలో పార్టీలకతీతంగా పనిచేసేవారిని కొనియాడారు. తాను నమ్మిన కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాల కోసం కడవరకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా జీవితాన్ని గడిపారని తెలిపారు. వక్కలగడ్డ గ్రామాభివృద్ధిలో కమ్యూనిస్టు పార్టీ మార్కు వేసిన రామసుబ్బయ్య ఈ తరం నాయకు లకు ఆదర్శంగా నిలుస్తారని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి రామ సుబ్బయ్య అహర్నిశలు కృషి చేసే వారిని ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకుని ఈ తరం నాయకులు కమ్యూనిస్టు పార్టీ గ్రామ స్థాయి నుండి బలోపేతానికి కృషి చేయడమే ఆయనకి నిజమైన నివాళి అన్నారు. సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పరి తపించే రామసుబ్బయ్య వక్కలగడ్డలో పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమించే వారన్నారు. ఆయన చూపిన బాటలోనే వారి వారసులు సైతం నడుస్తూ పార్టీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని కొనియాడారు. రామ సుబ్బయ్య కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకొని కమ్యూనిస్టు పార్టీ కుటుంబాలు పార్టీ బలోపేతం కోసం తమ వంతు సహకారం అందిస్తే పార్టీ మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.